క్లుప్తంగా

జీవాల లెక్క చెప్పండి



మాట్లాడుతున్న ఏడీ శ్రీధర్ రెడ్డి

కురబలకోట: పశుగణనకు రైతులు సహకరించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీధర్ రెడ్డి కోరారు. అంగళ్లులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు పశుగణన నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలకు వచ్చే ఎన్యుమరేటర్లకు ఆవులు, గేదెలు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర జీవాల లెక్కలను తెలియజేయాలన్నారు. పశుగణన ఆధారంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని పేర్కొన్నారు. సంఖ్యను బట్టే వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు సరఫరా చేస్తారని చెప్పారు. రైతులు ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్ రేసింగ్‌పై కఠిన చర్యలు



కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ రాజారెడ్డి

బి.కొత్తకోట: స్థానిక బైపాస్‌రోడ్డుపై బైక్ రేసింగ్‌లు చేస్తున్న యువకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజారెడ్డి హెచ్చరించారు. బైక్ రేసింగ్, మైనర్లు బైక్‌లు నడపడంపై ఆయన చర్యలు చేపట్టారు. బైక్‌లు నడుపుతున్న మైనర్ల కుటుంబీకులను రప్పించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్ట నిబంధనల మేరకు మైనర్లకు బైక్‌లు ఇవ్వడం, నడపడం చేయరాదని చెప్పారు. ఏదైనా ప్రమాదం జరిగినా, ఘటనలకు కారణమైనా కుటుంబీకులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ మాట్లాడుతూ బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న యువకులను గుర్తిస్తున్నామని, వారిపై చర్యలు తప్పవని అన్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బైక్ రేసింగ్ వల్ల బైపాస్‌రోడ్డులోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

కులగణన చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతిప్రత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయికులు

పీలేరు : షెడ్యూల్ కులాలను సామాజిక దృక్పథంతో కులగణన చేపట్టాలని మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నక్క వెంకటరణ కోరారు. బుధవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల వారీగా జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలహహనాడు ఐక్యవేదిక నాయకులు గుర్రం నారాయణ, రామాంజులు, గుండ్లూరు జయరామచంద్రయ్య, మల్లికార్జున, పల్లం నారాయణ, ఇరగన్న, మురళి, గోపి, శివనందన్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



బెస్ట్ పాఠశాల అవార్డు మెమెంటోను ఉపాధ్యాయులకు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కలికిరి: జూలై నెలలో ముంబాయిలో జరిగిన రంగోత్సవ్ జాతీయ స్థాయి డ్రాయింగ్ పోటీలకు కలికిరి మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 10 మందికి గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ 08, బ్రాస్ మెడల్స్ నలుగురిని ఎంపిక చేసి మెడల్స్, గుర్తింపు పత్రాలను సంస్థ పంపింది. పాఠశాల నుంచి ఎక్కువ మంది పోటీల్లో పాల్గొనడం, ఎక్కువ మందికి మెడల్స్ దక్కడంతో సంస్థ పాఠశాలకు సైతం బెస్ట్ స్కూల్ ఫర్ ప్యూచరిస్టిక్ ఎడ్యుకేషన్ అవార్డును అందజేశారు. ఈ మేరకు బుధవారం ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

అండగా ఉంటాం



విద్యార్థినితో మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం

మదనపల్లెసిటీ: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న ఇంటర్ విద్యార్థి స్వప్నను బుధవారం మదనపల్లె డీవైఈఓ శ్రీరాం పురుషోత్తం పరామర్శించారు. స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న విద్యార్థిని ఓదార్చారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని తెలిపారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట కేజీబీవీ ఎస్ఓ ముస్తాన్‌బీ, రూటా రాష్ట్ర నాయకులు పి.మహమ్మద్‌ఖాన్ ఉన్నారు.

ఆగిన మగ్గం.. నేతన్నల పస్తులు

- చేనేత రంగంపై తుపాను ప్రభావం
- ఆదుకోవాలని నేత కార్మికుల డిమాండ్

మదనపల్లె సిటీ: తుపాను ప్రభావం చేనేత రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో మగ్గాలపై ప్రభావం పడింది. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో పట్టుదారం మెత్తబడుతోంది. జాకార్డు అట్టలు కూడా మెత్తపడిపోయాయి. దీంతో చీరలు నేయడానికి వీలు లేకుండా పోయింది. నిత్యం మగ్గం ధ్వని వినిపించే మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె (సిల్క్‌టౌన్)లో చేనేత గృహాలు ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నిశ్శబ్దంగా మారాయి. గత పది రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు పడడంతో మగ్గాల గుంతల్లో నీటి చెమ్మ చేరింది. దీంతో మగ్గం నేసేందుకు వీలు కావడం లేదు. నీరగట్టువారిపల్లెలో మాయాబజార్, రాజానగర్, రాంరెడ్డి లేఅవుట్, కాట్లాటపల్లె రోడ్డు, వేంకటేశ్వరపురం, చౌడేశ్వరి నగర్, చంద్రకాలనీ, అనపగుట్ట, మారుతినగర్, కాట్లాటపల్లె రోడ్డు ప్రాంతాల్లోని మగ్గాలు వర్షాలు కారణంగా నిలిచిపోయాయి. చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులు పది రోజులుగా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేత కార్మికుల అవస్థలు

వర్షాలు కురుస్తుండటంతో నేతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మగ్గాలు నడవకపోవడంతో చీరల తయారీ తగ్గింది. వర్షాలు పడుతుండటంతో తేమ



ఖాళీగా ఉన్న మగ్గం

వాతావరణం వల్ల మగ్గాలు నేసేందుకు కార్మికులకు వీలు కావడం లేదు. చీరలు నేసే డిజైన్ అట్టలు కూడా మెత్తగా మారాయి. పోగు మెత్తబడి దారం తెగిపోతోంది. దీంతో చాలా మంది చీరలు నేయడం లేదు. చేనేత అనుబంధ రంగాల్లో పనిచేసే కార్మికులు కూడా పనులు లేక అవస్థలు పడుతున్నారు. వార్పు పట్టడం, రంగుల అద్దకం, చీరల పాలిష్ రంగాల్లో పని చేసే కార్మికులు పనులు లేక ఇళ్లకే పరిమితమయ్యారు. నీరుగట్టువారిపల్లెలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికిపైగా కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పది రోజులుగా వర్షాలు పడుతుండటం, వాతావరణంలో తేమ శాతం ఉండడంతో మగ్గాలు నేసేందుకు వీలు కావడం లేదని కార్మికులు చెబుతున్నారు. పనులు లేక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



వర్షానికి పనులు నిలిపివేశాం. పది రోజులుగా పనులు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో ఆర్డర్లు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో వర్షం దెబ్బతీసింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

–గుద్దేటి సుధాకర్,
చేనేత సమాఖ్య అధ్యక్షుడు, నీరుగట్టువారిపల్లె

దళితుల పట్ల వివక్ష తగదు

పీలేరురూరల్ : దళితుల పట్ల వివక్ష తగదని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ అన్నారు. బుధవారం పీలేరులో ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం గాంధీపేటకు చెందిన దళిత నాయకుడు రఘు తన అవసరం నిమిత్తం పోలీస్ అధికారికి ఫోన్ చేశాడని, అయితే ఎస్ఐ అసభ్య పదజాలంతో రఘును దూషించడం హేయమైన చర్య అన్నారు. అనంతరం దళిత నాయకుడు ప్రశ్నించడానికి వెళితే ఎస్ఐ సరైన సమాధానం చెప్పకపోవడం శోచనీయమన్నారు. ఎస్ఐ తన పద్ధతి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు రామాంజులు, జయరామచంద్రయ్య,, వెంకటరమణ, నారాయణ, మురళి, రమణ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

మాలలంతా ఐకమత్యంగా ఉండాలి

గుర్రంకొండ: మాలలంతా ఐకమత్యంగా ఉండాలని జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు శివయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తరిగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాలలకు ఎక్కడ అన్యాయం జరిగినా అందరూ ఐకమత్యంతో



గుర్రంకొండ: మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య

పోరాడాలన్నారు. ఇటీవల వాల్మీకీపురంలో జిల్లా కార్యదర్శి గాంధీపేట రఘును ఎస్ఐ అసభ్యకర పదజాలంతో దూషించడం దారుణమన్నారు. దళితులనే చిన్న చూపుతో అకారణంగా దుర్భాషలాడిన ఎస్ఐపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోమండల ప్రధాన కార్యదర్శి నాగరాజ, నాయకులు రమణ, ఈశ్వరయ్య,గంగులప్ప, రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



పీలేరురూరల్ : సమావేశంలో మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు

కలికిరి: వాల్మీకిపురం గాంధీపేటకు చెందిన దళిత నాయకుడు రఘును దూషించిన వాల్మీకిపురం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధికారప్రతినిధి హరి డిమాండ్ చేశారు. బుధవారం కలికిరిలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఐ రఘు దూషించడం సరికాదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు భానుప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సహదేవ, నాయకులు రామ, సురేష్, గోవిందు, సంజీవ, చంద్ర, విజయ్, శీను తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



బి.కొత్తకోట: వినతులు పరిశీలిస్తున్న తహసీల్దార్ అహ్మద్ అన్సారీ



పీలేరు : గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని ఆవులవారిపల్లెలో భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వే సందర్భంగా సరహద్దుల తప్పిదాలు, ఆన్‌లైన్‌లో ఒక పేరు, అనుభవంలో మరొక పేరు లాంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ సుబ్రమణ్యం, వీఆర్వో శాంతకుమార్‌రెడ్డి, సర్వేయర్ కిరణ్మయి పాల్గొన్నారు.

టి.సంద్రావారిపల్లిలో గ్రామసభ

కలికిరి: మండలంలోని టి.సంద్రావారిపల్లి గ్రామంలో బుధవారం తహసీల్దారు మహేశ్వరీబాయి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ రీసర్వే పూర్తి కావడంతో విస్తీర్ణం, సర్వే నంబర్లు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ 1–బి నమోదు కాకపోవడంతో 21 మంది రైతులు వినతి ప్రత్రాలు అందజేశారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ నరేంద్రరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మదనపల్లె : భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ తెలిపారు. మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిపల్లెలో రీ సర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా, రైతులు, రీ సర్వేలో తాము ఎదుర్కొన్న సమస్యలపై, అధికారులకు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ అంకిశెట్టిపల్లె గ్రామంలో 135.80 ఎకరాల్లో రీసర్వే నిర్వహించామన్నారు. రీ సర్వేలో తలెత్తిన భూసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శరత్‌రెడ్డి, జంగాలశివరాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో వినతులు

బి.కొత్తకోట: భూ సమస్యలను పరిష్కరించి ఇబ్బందులను తొలగించాలని రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. బుధవారం మండలంలోని కోటావూరు గ్రామం అమరనారాయణపురంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చారు. అధికంగా మ్యూటేషన్లు, తప్పుల సవరణలు, వారసత్వ హక్కుల కల్పన, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలు తీర్చాలని కోరారు. దీనిపై సత్వర చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అహ్మద్ అన్సారీ రైతులకు తెలిపారు. ఆర్ఐ రామాంజనేయులు, వీఆర్ఓ నరేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లెలో వెలసిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో బుధవారం సీతారాములకు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామపెద్దలు భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సీతారాములను పుష్పపల్లకిలో ఊరేగించారు.

పరామర్శ



ఇబ్రహీం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పట్టణంలోని కొత్తపేటవీధికి చెందిన మాజీ హజ్ కమిటీ స్టేట్ మెంబర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు ఎండీ ఇబ్రహీంను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఇటీవల ఇబ్రహీం, సతీమణి ఖుర్షిదాకు గుండె ఆపరేషన్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల బుధవారం ఇబ్రహీం స్వగృహానికి వెళ్లి ఇబ్రహీం దంపతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, సాధిక్, అలీ, అషర్, ఇమ్రాన్, ఇర్ఫాన్, యూసుఫ్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మదనపల్లె సిటీ: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేశవరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని శ్రీ కృష్ణ చైతన్య నర్సింగ్ కాలేజీలో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఆకలి తగ్గిపోయి, జ్ఞాపకశక్తి తగ్గిపోతుందన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎస్‌టీఓగా నరేష్

మదనపల్లె సిటీ: మదనపల్లె సబ్ ట్రెజరీ అధికారిగా నరేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌టీఓను ఎస్‌టీయూ రాష్ట్ర కన్వీనర్ ఆర్‌వీ రమణ, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు చిన్నరెడ్డి, శివశంకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం

మదనపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదునెలలు కావస్తున్నా, ఇప్పటివరకు నిరుద్యోగుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ విమర్శించారు. బుధవారం స్థానిక సంతగేటులోని ఏఐటీయూసీ కార్యాలయంలో అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ వలంటీర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో వలంటీర్లకు ఇచ్చిన హామీపై, కార్మిక, చిరుద్యోగ సమస్యలపై చర్చించకపోవడం దుర్మార్గమన్నారు. వలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు వారిని యధావిధిగా కొనసాగించాలని, గౌరవవేతనం రూ.10వేలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగునెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

గన్‌వాడీలు గతంలో చేపట్టిన సమ్మెకాలపు హామీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఈనెల 26న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మదనపల్లెలో జరిగే వలంటీర్ల సమావేశంలో వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కోశాధికారి సలీంబాషా, ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, అలవేలమ్మ, వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తంబళ్లపల్లె: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు గోపిదిన్నె పంచాయతీ కొత్తపల్లికు చెందిన కె.నరసింహారెడ్డి (65) చిన్న నరసింహారెడ్డి (82) బైక్‌పై బుధవారం ఉప్పులూరివాండ్లపల్లెకు వెళుతుండగా గోపిదిన్నె క్రాస్‌రోడ్డులో తంబళ్లపల్లె నుంచి బంద్రేవుకు వెళుతున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ప్రైవేటు వాహనంలో తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి



ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న కె. నరసింహారెడ్డి, చిన్న నరసింహారెడ్డి

తరలించారు. ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

మదనపల్లె: పొలం వద్ద తగాదా కారణంగా మహిళపై మరో మహిళ కొడవలితో దాడి చేసిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని వేంపల్లికి చెందిన రమణమ్మ (60) కోడలుతో అదే గ్రామానికి చెందిన శ్రీదేవి పొలం వద్ద గొడవ పడింది. సాయంత్రం రమణమ్మ, శ్రీదేవి ఇంటివద్దకు వెళ్లి తన కోడలితో ఎందుకు గొడవపడ్డావంటూ నిలదీసింది. దీంతో ఆవేశానికి గురైన శ్రీదేవి కొడవలితో రమణమ్మపై దాడి చేసింది. దాడిలో రమణమ్మ



గాయపడిన రమణమ్మ

తలకు తీవ్రగాయం కాగా గమనించిన స్థానికులు వెంటనే బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

సంఘమిత్ర అక్రమాలపై విచారణ

మదనపల్లె : మండలంలోని పోతపోలు పంచాయతీలో డ్వాక్రా మహిళాసంఘాల సభ్యుల సొమ్ములకు సంబంధించి సంఘమిత్ర పుణ్యవతి అక్రమాలకు పాల్పడిందని వచ్చిన ఫిర్యాదులపై బుధవారం రెండోవిడత విచారణ నిర్వహించారు. సంఘమిత్ర పుణ్యవతి పావలా వడ్డీ రుణాలు, గ్రూపు డబ్బులు సకాలంలో సభ్యులకు అందజేయకుండా సొంత అవసరాలకు వాడుకోవడం, బ్యాంకు రుణాలు ఇప్పించడం లేదని సభ్యులు ఆరోపిస్తూ, జిల్లా అధికారులకు, సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఎం కార్యాలయం నుంచి విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు రావడంతో బ్యాంకు లింకేజ్ బీపీఎం లక్ష్మీప్రసాద్‌రెడ్డి విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు తెలిపారు. విచారణలో ఏపీఎం సుబ్రహ్మణ్యం, పోతబోలు క్లస్టర్ సీసీలు లక్ష్మీదేవి, శారద, పాన్యూటిపాళ్యం, సీసీ శివశంకర్, కొత్తపల్లె క్లస్టర్ గంగులప్ప, సీటీఎం క్లస్టర్ గోపాల్ పాల్గొన్నారు.



పోతబోలులో విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

నిబంధనల ప్రకారం దుకాణాలు పెట్టాలి

పీలేరురూరల్ : దీపావళి పండుగను పురస్కరించుకుని నిబంధనల ప్రకారం టపాకాయల దుకాణాలు పెట్టుకోవాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, సీఐ యుగంధర్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో టపాకాయల దుకాణాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది దుకాణాలకు గానూ ప్రస్తుతం 25 దరఖాస్తులు అందాయని తెలిపారు. అన్ని దుకాణాల వద్ద ఇసుక, నీరు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర అధికారి మహబూబ్‌బాషా, ఎస్ఐ బాలకృష్ణ,సర్వేయర్ కిరణ్మయి పాల్గొన్నారు.



టపాకాయల దుకాణాల స్థలాలు పరిశీలిస్తున్న అధికారులు

గుండెపోటుతో రైతు మృతి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: గుండెపోటుతో ఓ రైతు మృతి చెందిన విషాద సంఘటన బుధవారం మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు మండలంలోని కన్నెమడుగు పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు కె.ఆర్.చిన్నరెడ్డి (66) మంగళవారం చాతీలో నొప్పి రావడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందతూ మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని రెడ్డివారిపల్లెకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రైతు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



చిన్నరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

పీలేరు : విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయంపై అవగాహన ఉండాలని వృక్షశాస్త్ర అధ్యాపకురాలు జ్ఞానశ్రీ అన్నారు. స్థానిక సీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం బీఎస్సీ సైన్స్ విద్యార్థులకు పొలం నుంచి కంచెంలోకి ఆహారం ఎలా వస్తుందో క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఇంటి ఆవరణలో మిద్దెలపై తోటలు ఎలా పెంపకం చేసుకోవచ్చో, ఆరోగ్యకరమైన పంటలు పండించుకునే విధానంపై అవగాహన కల్పించారు. సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయబాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మదనపల్లె : పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఖాళీస్థలం కనిపించిందంటే చాలు రాత్రికి రాత్రే షెడ్‌లు ఏర్పాటు చేసుకుని ఉదయానికి ఓపెనింగ్‌లు చేసేస్తున్నారు. ఎవరైనా అనుమతులు ఉన్నాయా అని అడిగితే.. రాజకీయ ఒత్తిడులు, బెదిరింపులతో నోరు మూయించేస్తున్నారు. అనధికారికంగా వెలుస్తున్న దుకాణాలతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ జఠిలం అవుతుంటే, మున్సిపల్, పోలీస్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో బసినికొండ నుంచి నీరుగట్టువారిపల్లె వరకు రోడ్డుపైనే అనధికారికంగా 600 దుకాణాల వరకు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏడీఎస్, ఎంఎల్ఎల్ ఆస్పత్రి, చిత్తూరు బస్టాండ్, జేసీఎం చర్చి, జ్యోతి థియేటర్ ఎదురుగా, బెంగళూరు బస్టాండ్, ఎన్‌జీఓ హోం పక్కన, సంతగేటు అన్నా క్యాంటీన్ వెనుక వైపు, ఆర్టీసీ బస్టాండు, సీటీఎం రోడ్డు కరెంట్ ఆఫీస్, అనిబిసెంట్ సర్కిల్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, తహసీల్దార్ కార్యాలయం, టిప్పుసుల్తాన్ గ్రౌండ్స్, మార్కెట్‌యార్డు, రింగ్‌రోడ్డు, అమ్మచెరువుమిట్ట తదితర ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో అనధికారికంగా



ఎన్‌జీఓ హోమ్ పక్కన రోడ్డుపై ఏర్పాటు చేసిన హోటల్

దుకాణాలు ఏర్పాటయ్యాయి. వీటితో మున్సిపాలిటీకి ఆదాయం రాకపోగా, ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు ఖాళీ ప్రదేశాల్లో షెడ్లు ఏర్పాటు చేసి, చిరు వ్యాపారులకు అద్దెలకు ఇస్తూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

రోడ్లపై అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న బంకుల నుంచి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులు అందుతుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పైపెచ్చు నామమాత్రంగా ఎన్‌క్రోచ్‌మెంట్ ఫీజు కట్టుకుని, బంకులకు కరెంటు కనెక్షన్లు ఇచ్చేందుకు సహకరిస్తున్నారు.పట్టణంలో కొత్తగా ఏర్పాటవుతున్న పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్ పార్కింగ్ వసతులు లేకుండానే వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీంతో ఆయా మాల్స్‌కు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి వెళుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పట్టణంలోని ప్రధానరహదారులపై అడ్డూఅదుపు లేకుండా ఏర్పాటవుతున్న దుకాణాలు, షెడ్లను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.